
'ఈ ప్రక్క వాటాలోకి కొత్తవాళ్లొస్తున్నారు. భార్యాభర్తలిద్దరేటమ్మాయ్. పెళ్లయి ఆర్నెల్లే అయిందిట. మా ఆయన ఆఫీసులో పనిచేసే సుబ్బారావుగారికి చుట్టం' అంటూ ఒకరోజు ఇంటావిడ సుజాతతో చెప్పింది.

'అలాగా! ఎప్పుడొస్తున్నారు పిన్నిగారూ?' అనడిగింది సుజాత.

'వచ్చే ఆదివారం వస్తారటమ్మా' అందావిడ.

ఆదివారమంటే... ఇంకా మూడురోజులుంది అనుకుంది సుజాత.

అది మూడు పోర్షన్లున్న పెద్ద డాబాయిల్లు. మధ్య పోర్షన్‌లో ఇంటివాళ్లుంటారు. ఒక పోర్ష



న్‌లో సుజాత, ఆమె భర్తా ఉంటున్నారు. మరొక పోర్షన్‌లో రెండు నెలల క్రితం వరకూ వృద్ధదంపతులు ఉండేవారు. ముసలాయన చనిపోవడంతో ఆవిడ పిల్లల దగ్గరకు వెళ్లిపోయింది. ఆవిడ వెళ్లినప్పటినుంచీ ఆ పోర్షన్‌లోకి ఎవరైనా తన వయసువాళ్లొస్తే బావుండుననుకునేది సుజాత. ఇప్పుడు ఇంటావిడ చెప్పింది వినగానే తన కోరిక నెరవేరబోతోందని ఆనందించింది.

ఆదివారం త్వరగా లేచి ఇంటిపనులు ముగించుకుంది. ఆ జంట ఎలా ఉంటారో చూడాలనే ఉత్సాహం ఎక్కువైంది.

'అంత హడావిడి పడుతున్నావ్. ఎక్కడికైనా వెళ్లాలా తమరు?' వ్యంగ్యంగా అన్నాడు ప్రభాకర్.

'అబ్బే అదేంలేదు. వూరికినే' అంది ఇంకే మనాలో తెలీక...

పదకొండు గంటల ప్రాంతంలో ఇంటి ముందు లారీ... ఆ వెనుక ఆటో ఆగాయి. సుజాత పరుగెట్టుకెళ్లి కిటికీ దగ్గర నిలబడింది. ఆటోలోంచి భార్యాభర్తలిద్దరూ దిగారు. ఇంటావిడ అన్నట్లు జంట బాగానే ఉంది అనుకుంది. లారీలో నుంచి సామాన్లు దింపుతూంటే అతడు లోపల పెడుతున్నాడు. గేటు తీసుకుని లోపలికొచ్చి మెట్లెక్కుతోంటే ఆ నడక - ఆ మాటలు - ఆ ముఖం ఎక్కడో చూసినట్లుగా, అతను బాగా పరిచయమైన వ్యక్తిలా కనిపించాడు సుజాతకు.

ఎక్కడ చూసాను... తనకెలా పరిచయం?... ఆలోచించసాగింది.

'ఏయ్! ఎంతసేపు ఆ కిటికీకి అతుక్కుపోతావ్? ఎవడ్ని చూస్తున్నావేంటి! కాఫీ ఇమ్మని ఇప్పటికి పదిసార్లడిగాను' అంటూ అరవసాగాడు ప్రభాకర్.

సుజాత ఉలిక్కిపడి వంటింట్లోకి పరిగెత్తింది.

స్టవ్ వెలిగించి భర్తకి కాఫీ పెట్టింది. మనసులో ఆ వ్యక్తి ముఖమే మెదులుతోంది. జ్ఞాపకాల పొరలను తొలచి చూస్తూంటే... హఠాత్తుగా గుర్తొచ్చాడు...

అతడు రెండేళ్ల క్రితం తనను చూడడానికొచ్చిన పెళ్లికొడుకు.

అవును... అతడే... అనుకుంటూ భర్తకు కాఫీ ఇవ్వాలని గది బయటకు వచ్చింది.

వరండాలో నిలబడ్డ ప్రభాకర్‌ని అతడేదో అడుగుతున్నాడు. సుజాత పరిశీలనగా చూసింది.

అవును... రాఘవ. సందేహం లేదు అనుకుంది. ప్రభాకర్ లోపలికి రాగానే కాఫీ కప్పు

విన్నకోట సుశీలాదేవి

అందించి, వంటింట్లోకి వచ్చింది. ఒక పక్కగా ఉన్న డైనింగ్‌టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చుంది.

మనసులో ఆనాటి సంఘటనలు మెదిలాయి.

సుజాత డిగ్రీ పూర్తిచేయగానే పెళ్లిసంబంధాలు చూడసాగాడు తండ్రి. సుజాతకు ఎమ్మే చదివి లెక్చరర్ ఉద్యోగం చేయాలని ఉండేది. తన కోరిక తల్లిదండ్రులకు చెప్పాలనుకుంటూండగానే తండ్రి పెళ్లిసంబంధం తీసుకు రావడం, సుజాత పెళ్లిచూపులకు కూర్చోవడం జరిగింది.

అలా వచ్చిన పెళ్లికొడుకే ఈ రాఘవ. రాఘవ ఎమ్మే చదివాడు. బ్యాంకులో ఉద్యోగం. పొడుగ్గా, అందంగా, హుందాగా ఉన్నాడు. అందరికీ నచ్చిందీ సంబంధం.

పెళ్లిచూపులకు రాఘవ తన స్నేహితునితో కలిసి వచ్చాడు. 'పెళ్లంటే అమ్మాయి – అబ్బాయి పరస్పర ఇష్టాలతో జరగాలి కదండీ. ముందు మాకు అంగీకారం అయితే... ఆ తర్వాత పెద్దలు వస్తారు' అన్నాడు.

అతని తల్లిదండ్రులు కూడా వస్తే బావుండేది కదా! ఏమిటో ఈ కాలపు కుర్రాళ్ల ఆలోచనలు అనుకున్నాడు సుజాత తండ్రి.

రాఘవ సుజాతని రెండు మూడు ప్రశ్నలు వేసాడు. 'మీరు కూడా నన్నేమైనా అడగండి!' అన్నాడు.

సుజాత మాట్లాడలేదు. మరింత తలొంచుకుంది బిడియంగా.

'అంత మొహమాటం పనికిరాదండీ. ఏదన్నా అడగండి' అన్నాడు.

'ఏమీలేవు' సన్నగా అంది.

ఓ.కె... చూడండి మూర్తిగారూ! మీ అమ్మాయి నాకు నచ్చింది. మీ అమ్మాయిక్కూడా నేను నచ్చానో లేదో కనుక్కోండి అన్నాడు రాఘవ.

ఆ మాటలకు సుజాత సిగ్గుపడింది.

'మీ పెద్దవాళ్లు కూడా వచ్చి అమ్మాయిని చూడాలిగా బాబూ' అన్నాడు తండ్రి.

వాళ్లు నా మాట కాదనరు. సుజాతగారూ! మీరు చదువుకున్నవారు. మీ అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పండి.

సుజాత తలెత్తి 'నచ్చారు' అంది మెల్లిగా.


'థ్యాంక్యూ సుజాతగారూ' అని, ఆమె తండ్రివైపు తిరిగి 'మూర్తిగారూ! నాకు కట్న కానుకలు అక్కర్లేదు. మా పెళ్లి కూడా రిజిస్ట్రారాఫీసులో జరగాలి. పెళ్లిళ్లు రిజిష్టరవడం ఈ కాలంలో చాలా అవసరం. ఇక విందులనీ, వినోదాలనీ డబ్బు ఖర్చుచేయడం నాకిష్టం ఉండదు. అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టకండి. మావేపు నుంచి నా స్నేహితులు పదిమంది తప్ప ఇక ఎవ్వరూ రారు. రిజిస్ట్రారాఫీసులో పెళ్లయ్యాక సింపుల్‌గా చిన్న పార్టీ అంతే. మీరు ఇష్టపడితే రేపే వెళ్లి ఆఫీసులో అప్లికేషన్ ఇచ్చొస్తా!' అన్నాడు రాఘవ.

ఆ మాటలకు సుజాత తండ్రి ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఏం చెప్పాలో తోచలేదు.

మాకు కొద్దిగా టైమివ్వండి. నా భార్యతో ఆలోచించి చెప్తా! అన్నాడు.

ఓ... అలాగే... మీ ఇష్టం. ఇక మేం వెళ్తాం అంటూ లేచాడు రాఘవ.

సుజాతకు రాఘవ బాగా నచ్చాడు. అతని




ధైర్యం, చొరవ, ముఖ్యంగా కట్నం తీసుకోననే అతని ఆదర్శం... పెళ్లి ఖర్చు తగ్గించాలనే అతని ఆలోచన... ఇవన్నీ ఇంకా బాగా నచ్చాయి. ఇంతకంటే ఏం కావాలి? తమలాంటి మధ్య తరగతి కుటుంబానికి ఇటువంటి సంబంధం దొరకడం చాలా అదృష్టం. అమ్మానాన్నా దీనికి వెంటనే అంగీకరిస్తారు అనుకుంది. రాఘవ చక్కని రూపం ఆమె కళ్లముందు మెదిలింది. మధురోహలతో ఆమె మనస్సు నిండిపోయింది. రాఘవతో తన వైవాహిక జీవితాన్ని ఊహించుకుంటూ ఆ రాత్రల్లా అందమైన కలల్లో తేలిపోయింది.

మర్నాడు సుజాతని పిలిచి అన్నాడు తండ్రి – సుజాతా! ఈ సంబంధం మాకిష్టంలేదని అతనికి ఫోన్ చేస్తున్నాను.

ఆ మాటలకు తెల్లబోయింది సుజాత.

'ఎందుకు ఇష్టంలేదు నాన్నా? మంచి ఉద్యోగం. పైగా కట్నం ఏమీ వద్దన్నారుగా' అంది.

'అందుకేనమ్మా! మనమూ వద్దనుకుంది. అంత పెద్ద ఉద్యోగం చేస్తున్నవాడు కట్నం ఏమీ వద్దంటున్నాడూ అంటే ఏదో లోటుందన్న మాట. పైగా పెద్దవాళ్లంటే లెక్కలేనట్లు మాట్లాడుతున్నాడు. రిజిస్ట్రారాఫీసులో పెళ్లిట. అతని మాటలు, ఆలోచనలూ నాకేం నచ్చలేదు. అటువంటి వాళ్ల ఆదర్శాలన్నీ మాటలవరకే. రేపు పెళ్లయ్యాక ఎలా తయారవుతాడో...' అన్నాడు తండ్రి.

సుజాత ఏం మాట్లాడలేదు.

రాఘవని వదులుకోవాలంటే ఆమెకి చాలా బాధగా ఉంది. కానీ తండ్రితో ఏం అనలేకపోయింది.

పదిరోజుల తర్వాత సుజాత పేరున రాఘవ ఒక ఉత్తరం రాసాడు.

సుజాతగారూ!

మీ వాళ్లకు నా అభిప్రాయాలు నచ్చవని

నాకు తెలుసు. లక్షల కట్నం, అంతకు రెట్టింపు లాంఛనాలు అడిగితే మీ తండ్రిలాంటి వాళ్లకు సంతోషం. లక్షలు ఖర్చుపెట్టి పెళ్లి ఆర్భాటంగా చేయమంటే తాము అప్పులపాలయినా ఆనందంగా చేస్తారు. ఇదీ మధ్యతరగతి మనస్తత్వం. కానీ నాలాంటి వాళ్లు కట్నం వద్దంటే ఎన్నో అనుమానాలు, సందేహాలు. సుజాతగారూ! నేను మొట్టమొదటగా చూసింది మిమ్మల్నే. మీరు నాకు బాగా నచ్చారు. మీరు చదువుకున్న వారు. నా అభిప్రాయాలు మీకు నచ్చాయి కదా. అయితే వెంటనే మీ వాళ్లకు నచ్చచెప్పి వచ్చేయండి. లేదా వాళ్లను ఎదిరించి వచ్చేయండి. మనం పెళ్లిచేసుకుందాం. నన్ను నమ్మండి.

– రాఘవ

ఆ ఉత్తరం చదువుకుని ఎంతో ఆశపడింది. ఆరాటపడింది. కానీ అతడు చెప్పినదేమీ చేయలేకపోయింది. గడపదాటలేని అశక్తత. తల్లిదండ్రులకు చెప్పలేని పిరికితనం. ఆమెకి బాధనే మిగిల్చాయి. ఆకుచాటు పిందెలా బతికిన మధ్యతరగతి ఆడపిల్ల ఈ సుజాత అనుకుంటూ మౌనంగా దుఃఖించింది.

మళ్లీ ఇన్నాళ్లకు రాఘవ కనబడ్డాడు. పెళ్లి చేసుకున్నాడు. ఆమె ఎవరో చాలా అదృష్టవంతురాలు అనుకుంది. అతడు తనను మర్చిపోయి ఉంటాడు. అయినా ఇప్పుడతనికి ఆ పాత పెళ్లిచూపులూ – పరిచయాలూ గుర్తుంటాయా? ఒకవేళ ఉన్నా లేనట్లు నటిస్తాడు... అలా ఉంటే తనకీ మంచిదేగా... పైగా తన భర్త ఒట్టి అనుమానపు మనిషి.

'ఏయ్! నిద్రపోతున్నావా ఏమిటి? ఛీ... ఛీ... ఎప్పుడూ మందకొడిగా ఉంటావ్. ఎందుకూ పనికిరాని మొద్దుని నాకెట్టబెట్టారు మీ వాళ్లు. ఒంటిగంట దాటింది. అన్నం పెట్టేదేమన్నా ఉందా లేదా?' భర్త అరుపులతో ఈ లోకంలోకి వచ్చింది సుజాత.

లేచి గబగబా టేబుల్‌పై అన్నీ సర్దింది. భోజనం చేస్తుండగా అంటున్నాడు –

ఈ పండక్కయినా మీ నాన్న స్కూటర్ కొనిస్తాడా? లేదా? ఇప్పటికి రెండుసార్లు వాయిదా వేసాడు. ఇక ఇవ్వకపోతే నేనూరుకోను. పక్క పోర్షన్‌లో కొత్తగా చేరినాయన బ్యాంకు ఉద్యోగిట. అతని స్కూటర్ ఎంత బావుందో చూసావా? అత్తగారు కొనిచ్చారుట. అతను చెప్పాడు. ఎంతయినా అదృష్టవంతుడులే. అందరూ నాలాగే ఉంటారా? ఏడాదిగ్గానీ కట్నం డబ్బులు పూర్తిగా ఇవ్వలేదు. నువ్వు వెంటనే బయలుదేరి వెళ్లి స్కూటర్‌కి డబ్బులు పట్రా. తెలిసిందా!

సుజాత మనస్సు ఇక్కడలేదు.

రాఘవకి స్కూటర్ అత్తవారిచ్చారా? ఆ రోజు కట్నాలూ – లాంఛనాలూ వద్దని ఆదర్శాలు పలికేడుగా. అవన్నీ ఏమయ్యాయి? నాన్న అన్నట్లు అన్నీ మాటల వరకేనా? పెళ్లయ్యాక ఆదర్శాలు పక్కనపెట్టి అత్తవారిని పీడిస్తున్నాడా? ఛఛ... మగాళ్లందరూ ఒక్కటే... ఒట్టి అవకాశవాదులు. వాళ్ల నీతులన్నీ మాటల వరకే' అనుకుంది కోపంగా.


అప్పటివరకూ రాఘవపై గల గౌరవం అస

---

టి.వి. వల్ల హింసా ప్రవృత్తి పెరిగిపోతోంది... అన్నాడు వాసు.

ఎలా చెప్పగలవ్? ప్రశ్నించాడు మధు.

ఎలాగేమిటి? ఎప్పుడు టి.వి. ఆన్ చేసి కూర్చున్నా మా నాన్న నన్ను కొట్టినంత పని చేస్తున్నాడు సమాధానం చెప్పాడు వాసు.




హ్యంగా మారింది.

★ ★ ★

'హల్లో సుజాతగారూ... బావున్నారా?'

గేటు తీసుకుని లోపలికొస్తున్న రాఘవ పలకరించాడు. భుజాన ఎయిర్‌బ్యాగ్ తగిలించుకుని గబగబా నడుస్తున్న సుజాత ఆ పలకరింపుతో ఆగిపోయింది. తలెత్తి రాఘవని చూసింది.

'అదేమిటలా చూస్తున్నారు? నన్ను మర్చిపోయారా? అన్నాడు.

సుజాత బిత్తరపోయింది. అతడు తనను గుర్తుంచుకుంటాడని గానీ, గుర్తున్నా ఇలా పలకరిస్తాడని గానీ అనుకోలేదు.

'మీరు నన్ను మర్చిపోయినట్లున్నారు' అన్నాడు స్కూటరు లోపలికి తీసుకొస్తూ...

'అబ్బే లేదు... లేదు' తడబడింది సుజాత.

'అయితే రండి మా ఇంట్లోకి, మా ఆవిడని పరిచయం చేస్తాను'

'అబ్బే వద్దు... వద్దు...' అంది మరింత కంగారుగా.

మీరేం మారలేదండీ... అదే మొహమాటం, అదే బిడియం... అంటూ స్కూటర్ స్టాండ్ వేసాడు.

'పద్మా... పద్మా' అని పిల్చాడు.

పద్మ కర్టెన్ తీసుకుని బయటికొచ్చింది.

పద్మా! మనింటికెవరొచ్చారో చూడు! అన్నాడు రాఘవ.

పద్మ సుజాత వైపు నవ్వుతూ చూసింది.

నాకు తెలుసు! అటుపక్క వాటాలో ఉంటారు... సుజాతగారు. మనింటికి రమ్మని పిలిచాను కూడా. ఇప్పటికి దయ కలిగింది. రండి లోపలికి... ఆప్యాయంగా ఆహ్వానించింది పద్మ.

ఆమె అభిమానానికి ముగ్ధురాలయింది సుజాత. లోపలికెళ్లి కుర్చీలో కూర్చుంది. చుట్టూ చూసింది. ఇల్లంతా ఎంతో అందంగా తీర్చి

దిద్దుకుంది పద్మ.

'తీసుకోండి'... పకోడీల పళ్లెం అందించింది పద్మ.

'ఎందుకండీ ఇవన్నీ'...

'మనమిప్పుడు స్నేహితులం. మీరు ఎటువంటి సంకోచాలూ పెట్టుకోకూడదు. తెలిసిందా?' అంది పద్మ.

రాఘవ లోపలి నుంచి వచ్చి తనొక ప్లేటు అందుకున్నాడు.

'మీ గురించి పద్మకి చెప్పాను' అన్నాడు.

సుజాత కంగారుపడింది. ఏమని? అన్నట్లు చూసింది.

'మీ వాళ్ల చాదస్తం వల్ల – మీ పిరికితనం వల్ల మన పెళ్లికాలేదని'...

సుజాత తెల్లబోయింది.

'ఇటువంటివి భార్యతో చెప్తారా ఎవరైనా? ఆవిడ ఏమనుకుంటుందో'... అనుకొంది. ఇంతలో పద్మ అంది.

'మీరు చదువుకున్నా మూర్ఖంగా ప్రవర్తించారని కొంత బాధగా ఉన్నా ఇటువంటి ఆదర్శ మూర్తి నాకు భర్త అయినందుకు ఆనందంగా ఉంది' అంది పద్మ.

'చాలామంది ఆదర్శాలు మాటల్లో చెప్తారు గానీ చేతల్లో చూపలేరు' అంది సుజాత కోపాన్ని దాచుకుంటూ.

'కరెక్ట్.... చాలా బాగా చెప్పారు. కాని నేను ఆదర్శాలు చేతల్లో చూపిస్తాను. మాటల్లో మాత్రం స్వార్థపరుడిని' అంటూ లోపలికెళ్లి చేతులు కడుక్కొచ్చాడు.

సుజాతకేం అర్థంకాలేదు.

పద్మ లోపలకు వెళ్లి రెండు కప్పులతో కాఫీ తెచ్చింది.

'సుజాతగారూ! ఈయన ఆదర్శాలు విని పెళ్లివారు అనుమానపడి ఎలా పారిపోయారో చుట్టూ ఉన్న సంఘం కూడా అలాగే అనుమానిస్తూ వేధిస్తోంది. కొంతమంది ఈయన అబద్ధాలు చెప్తున్నాడని ప్రచారం చేస్తోంటే... కొంతమంది గొప్ప నటుడని వ్యంగ్యబాణాలు వేస్తున్నారు. ఇవన్నీ భరించలేక స్కూటర్, టి.వి. లాంటివి అత్తవారు కొనిచ్చారని చెప్పడం మొదలుపెట్టారు' అంది నవ్వుతూ.


'ఇదొక వింత ప్రపంచంలెండి. అందరూ తమలాగే ఉండాలని కోరుకుంటారు. తమకంటే భిన్నంగా ఎవడైనా కనబడితే వాడిని తమ వేపుకైనా లాగుతారు. లేదా వాడిని గూర్చి చెడుగా ప్రచారం చేస్తారు. మీరేమిటండీ అలా ఉండిపోయారు. కాఫీ తీసుకోండి' అన్నాడు.

సుజాత కాఫీ తాగలేకపోయింది. రాఘవ మాటల్ని ఆశ్చర్యంగా వినసాగింది. మనసులో తీవ్ర పశ్చాత్తాపం కలిగింది. అతడిని అపార్థం చేసుకున్నందుకు ఎంతో బాధపడిపోయింది.

'నా తపస్సు ఫలించి అనుకూలవతి అయిన భార్య దొరికింది. నేనదృష్టవంతుడిని... అన్నాడు రాఘవ పద్మవైపు అభిమానంగా చూస్తూ.

అతని మాటలు సూదుల్లా గుచ్చుకున్నాయి. ఏనాడైనా తన భర్త ఇలా ప్రేమగా మాట్లాడాడా? తనని చూడగానే అతనికి తను పోగొట్టుకున్న కట్నం, తండ్రి జరపాల్సిన లాంఛనాలూ గుర్తొస్తాయి. అంతా తన దురదృష్టం.

ఇక అక్కడ కూర్చోలేకపోయింది. వారి అనురాగాన్ని చూస్తూ తట్టుకోలేకపోతోంది. తాను




పోగొట్టుకున్నదేమిటో తెలుస్తున్నకొద్దీ ఆవేదనతో దుఖం పొంగుకువస్తోంది.

'వెళ్లొస్తానండీ' అంటూ ఎయిర్‌బ్యాగ్ అందుకుంది.

'అరె... ఎక్కడికో బయలుదేరినట్లున్నారు. గమనించనే లేదు' అన్నాడు రాఘవ.

'ఊరికి వెళుతున్నా... మా నాన్నగారిని చూడడానికి' అంది.

'ఏం ఒంట్లో బాగాలేదా?' అనడిగాడు.

'ఇప్పటివరకూ బాగానే ఉంది. నేను వెళ్లాకే ఆయనకు అనారోగ్యం మొదలవుతుంది' అనుకుంది. ఆమె మౌనాన్ని వేరుగా అర్ధంచేసుకున్న పద్మ 'ఏం బాధపడకండి. ఆయన కోలుకుంటారు' అంది.

సుజాత గబగబా నడిచి గేటు దగ్గరకు వెళ్లింది.

'మళ్లీ ఎప్పుడొస్తారు'?

'నాన్న స్కూటర్ డబ్బులు ఇచ్చినప్పుడు. ఇవ్వలేకపోతే – ఇక తిరిగి రాలేదు తను. ఇదే చివరి ప్రయాణం...' అనుకుని...

'ఏమో! తెలీదు' అంది.

'ఆటో తెమ్మంటారా?' అనడిగాడు రాఘవ.

'వద్దు... వద్దు... నేను వెళతాను. వెళ్లగలను' అంది కంగారుగా.

'అబ్బ... అదే బిడియం. అదే మొహమాటం. సుజాతగారూ మీరేం మారలేదు' అంటున్నాడు రాఘవ.

అవును తనేం మారలేదు. ఎలా మారుతుంది? పిరికితనం – బేలతనం – భయం అనే పళ్లమధ్య జీవితచక్రంలో నలిగిపోయే తనలాంటి అమ్మాయి మారదు. మారలేదు కూడా... అనుకుంటూ నిట్టూర్చింది. ●